ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

మంగళవారం 7 జనవరి 2025

యూనిఫామ్ రెండో విడత నిధులు విడుదల

సంగారెడ్డి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడి విద్యార్థులకు అందించే యూనిఫామ్ రెండో విడత నిధులు మంజూరయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని 1215 ప్రభుత్వ పాఠశాలల్లోని 1,02,318 మంది విద్యార్థుల యూనిఫామ్‌కు సంబంధించి రూ.51,15,900 నిధులను విడుల చేసినట్లు అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూనిఫామ్ కుట్టుకూలి డబ్బును ఎస్‌హెచ్‌జీ ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు.

వైభవోపేతంగా రథోత్సవం

సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం మహాలక్ష్మి గోదాసమేత విరాట్ వేంకటేశ్వరస్వామి రథయాత్ర సోమవారం సాయంత్రం కనులపండువగా సాగింది. పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్స్ నుంచి ప్రారంభమై కలెక్టరేట్, ఐబీ, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ మీదుగా వైకుంఠపురం ఆలయానికి చేరుకున్నది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకందాడై వరదాచార్యులు పర్యవేక్షణలో యువ వికాస్ ఆధ్వర్యంలో శ్రీవారి రథయాత్రను నిర్వహించారు. దేవనాథజీయర్ స్వామి ప్రత్యేక హారతి ఇచ్చి రథయాత్రను ప్రారంభించగా, దారిపొడవునా రంగురంగుల ముగ్గులు, మహిళల కోలాటాలు, డప్పులచప్పులు, కళాకారుల నృత్యాలతో శోభాయమానంగా సాగింది.

- సంగారెడ్డి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి)



రథయాత్రలో దేవనాథజీయర్‌స్వామి



శోభాయాత్రలో మహిళల సందడి, వేషధారణలో కళాకారుడు



వణుకుతున్న కోహీర్

- ఆరో రోజూ సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత
- 8.1 డిగ్రీలు నమోదు

కోహీర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో చలి తగ్గడం లేదు. సీజన్‌లోనే రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో గజగజ వణికిపోతున్నది. ఆరు రోజులుగా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. సోమవారం ఉదయం కోహీర్‌లో 8.1 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం 8.4 డిగ్రీలుండగా, శుక్రవారం 6.9 డిగ్రీలు నమోదైంది. శనివారం మరింతగా పడిపోగా సీజన్‌లోనే రికార్డుస్థాయిలో అత్యల్పంగా 6.0 డిగ్రీలుగా నమోదైంది. ఆదివారం ఉదయం 7.1 డిగ్రీలుండగా సోమవారం 8.1 డిగ్రీలున్నది. కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదుతో కోహీర్ మండలమంతా చిన్నారులు, వృద్ధులు చలికి అవస్థలు పడుతున్నారు. ప్రజలు ఉదయం 8 గంటల వరకు చలికి భయపడి ఇంట్లో నుంచి బయటికి రాలేరు. తప్పని పరిస్థితుల్లో పాల వ్యాపారులు, వ్యవసాయదారులు, కార్మికులు స్వెటర్‌లు, మంకీ క్యాప్‌లు ధరించి పనులకు వెళ్లారు. జిల్లాలోని కోహీర్‌తో పాటు అల్గోల్ 9.1 డిగ్రీల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత నమోదైంది.

సంగారెడ్డి ఓటర్లు 14,40,151 మంది



- జిల్లాలో పురుషులే అధికం
- భారీగా పెరిగిన యువత ఓట్లు
- స్థానిక ఎన్నికలకు ఇదే జాబితా
- తాజాగా ప్రకటించిన ఎన్నికల సంఘం
- ఇక ఎలక్షన్ రిజర్వేషన్ల కోసం ఎదురుచూపు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 6 : రాబోయే ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధమైంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సోమవారం ఎన్నికల సంఘం ఈ జాబితాను ప్రకటించింది. సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోలు, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో 14,40,151 మంది ఓటర్లు ఉన్నట్లుగా లెక్క తేల్చారు. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ఈ జాబితా ప్రకారమే నిర్వహించనున్నారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన తుది ఓటరు జాబితాను ప్రకటించడంతో ఎన్నికల్లో పోటీచేయనున్న ఆశావహులు సమాయత్తమవుతున్నారు. ఎవరెవరి ఓట్లు ఉన్నాయో.. ఎవరెవరివి మిస్సయ్యాయో ఆరాతీసే ప్రయత్నం చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నారాయణఖేడ్	1,18,848	1,18,563	09	2,37,428
అందోలు	1,23,244	1,29,386	03	2,52,633
జహీరాబాద్	1,38,914	1,39,315	03	2,78,232
సంగారెడ్డి	1,24,235	1,28,297	38	252,370
పటాన్‌చెరు	2,15,945	2,03,466	85	4,19,496
మొత్తం	7,21,186	7,18,827	138	14,40,151

పురుషులే అధికం

సంగారెడ్డి జిల్లాలో మహిళల కంటే పురుషుల ఓట్లే అధికంగా ఉన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 12వేల మంది, నారాయణఖేడ్‌లో 300 మంది పురుష ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3వేల మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. మెజారిటీ జిల్లాల్లో మహిళల ఓట్లే కీలకంగా ఉండగా, సంగారెడ్డి జిల్లాలో మాత్రం పురుషుల ఓట్లు ఎక్కువగా ఉండడం గమనార్హం.

రిజర్వేషన్లకు ఎదురుచూపు

ఇప్పటికే బీసీ కులగణన పూర్తయ్యింది. ఓటర్ల జాబితా కూడా విడుదలైంది. ఇక రిజర్వేషన్లను ప్రకటించాల్సి ఉంది. గతేడాది ఫిబ్రవరిలోనే గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. ఏడాదికాలంగా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 646 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇక 29 మండలాలకు జడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అదే విధంగా ఈనెల 27తో జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, అందోలు-జోగిపేట, అమీన్‌పూర్, ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్, నారాయణఖేడ్ మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగుస్తోంది. వీటికి కూడా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నారు. తాజాగా కోహీర్, గడ్డపోతారం, ఇస్నాపూర్‌లను కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే రిజర్వేషన్ల ప్రకటనే కీలకం కాబోతున్నది.

మెదక్ జిల్లాలో మహిళలే అధికం

మెదక్ అర్బన్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో మొత్తం 4,51,225 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. మెదక్ నియోజకవర్గంలో 278 పోలింగ్ కేంద్రాలుండగా, మొత్తం 2,20,908 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,04,917 మంది, మహిళలు 1,15,987 మంది, ఇతరులు నలుగురు. వీరిలో ఎన్ఆర్ఐ ఓటర్లు 9 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లలో పురుషులు 89 మంది. జిల్లాలోని నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం 2,30,317 మంది ఉండగా పురుషులు 1,11,611 మంది, మహిళలు 1,18,701 మంది, ఇతరులు ఐదుగురు. ఒక ఎన్ఆర్ఐ ఓటర్, 38 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లదే పైచేయి. ఓటర్లు తమ పేరు జాబితాలో ఉందని ధృవీకరించుకోవాలని, ఏవైనా పొరపాట్లు, మార్పులు అవసరమైతే సంబంధిత బూత్‌స్థాయి అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.



కూచన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు

అర్ధాకలి చదువులు

- కొనసాగుతున్న పదో తరగతి ప్రత్యేక తరగతులు
- విద్యార్థులకు అల్పాహారం కరువు
- ఒకపూట భోజనంతో సరిపెట్టుకుంటున్న వైనం
- దాతలు ముందుకొస్తే స్నాక్స్ అందే అవకాశం

మెదక్ జిల్లాలో	
ప్రభుత్వ పాఠశాలలు	165
పదో తరగతి విద్యార్థులు	7 వేలు
సంగారెడ్డి జిల్లాలో	
ప్రభుత్వ పాఠశాలలు	270
పదో తరగతి విద్యార్థులు	13 వేలు

మెదక్ అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో పదో తరగతి చదివే విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించడానికి విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. ఉత్తీర్ణత పెంచడానికి ఆయా సబ్జెక్టులకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు మొదలయ్యాయి. గతేడాది కంటే ఈసారి మెరుగైన ఫలితాలు సాధించడానికి కసరత్తు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్న విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం, సాయంత్రం వేళ స్నాక్స్ అందక అర్ధాకలితోనే చదువులు సాగించాల్సి వస్తోంది.

ఉదయం.. సాయంత్రం వేళల్లో

ప్రత్యేక తరగతులు ఈనెల 2 నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 8:15 నుంచి 9:15 గంటల వరకు, సాయంత్రం 4:15 నుంచి 5:15 గంటల వరకు నిర్వహిస్తున్నారు. పాఠ్యాంశాల బోధనతో పాటు స్లిప్ టెస్ట్‌లు, వారం, పక్షం నెల రోజులకో ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ తరగతులను ఎంఈవోలు, సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రగతి నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి అందజేస్తున్నారు. ప్రతీ పాఠశాల నుంచి కనీసం 10 నుంచి 20 మంది వరకు పది జీపీఏ సాధించేలా కసరత్తు చేస్తున్నారు.

విద్యార్థుల ఆకలి బాధలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంత విద్యార్థులే చదువుతుంటారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్ర వేళల్లో ప్రత్యేక తరగతులు కొనసాగుతుండడంతో వారు పాఠశాలలకు ముందుగానే వచ్చి, సాయంత్రం వేళ ఆలస్యంగా ఇంటికి చేరుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి స్కూళ్లకు వెళ్లడానికి విద్యార్థులకు ఆర్టీసీ బస్సులే దిక్కు. ఉదయం వేళ త్వరగా స్కూళ్లకు చేరుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ఉదయం వేళ ఇంట్లో అల్పాహారం చేయకుండానే పాఠశాలలకు చేరుకుంటున్నారు. విద్యార్థులు ఇంట్లో తినక, పాఠశాలలోనూ పెట్టకపోవడంతో కడుపులు మాడ్చుకుని చదువుకోవాల్సి వస్తోంది. మధ్యాహ్నం మాత్రమే భోజనం చేస్తున్నారు. మళ్లీ సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులు ఉండడంతో ఇంటికి చేరుకునే సరికి రాత్రవుతుంది. అప్పటి వరకు విద్యార్థులు నీరసించి పోతున్నారు. దాతలు ముందుకు వస్తేనే విద్యార్థుల ఆకలి బాధలు తీరుతాయి.

ఆకలి తీరుద్దాం...

విద్యార్థులకు పోషకాహారం చాలా అవసరం. చదువుపై దృష్టి సారించాలంటే ఆకలి బాధ ఉండకూడదు. స్థానిక ప్రజాప్రతినిధులు,

మిగతా 8వ పేజీలో..

అదుపు తప్పిన స్కూల్ బస్సు

- బైక్‌ను ఢీకొడుతూ రోడ్డుపక్కకు దూసుకెళ్లిన వాహనం
- ఒకరి పరిస్థితి విషమం.. విద్యార్థులకు స్వల్ప గాయాలు
- సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులో ఘటన

7

ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

కంది మండల పరిధిలోని రెండు దాబాలకు నోటీసులు జారీ

7

జహీరాబాద్ అభివృద్ధికి కృషి : ఎంపీ

సీఎం రేవంత్‌రెడ్డినే తొలగిద్దాం

- సమస్య పరిష్కరించకపోతే స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి
- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్
- సిద్దిపేటలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు

7





ఐఐటీహెచ్‌లో సరోద్ వాయిద్యంతో అలరిస్తున్న అమజద్ అలీఖాన్

వీనులవిందుగా సరోద్ సంగీతం

అలరించిన ఉస్తాద్ అమజద్ అలీఖాన్

కంది, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాదులో సోమవారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను కట్టిపడేసింది. ఇక్కడి ఆడిటోరియంలో ప్రఖ్యాత సరోద్ విద్వాంసుడు ఉస్తాద్ అమజద్ అలీఖాన్ తన వాయిద్యంతో అందరినీ మంత్రముగ్ధుల్ని చేశారు. ఐఐటీహైదరాబాద్‌లో మే 26 నుంచి జూన్ 1 వరకు సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ యూత్ సహకారంతో శాస్త్రీయ సంగీతం, నృత్య కళల 10వ అంతర్జాతీయ మహాసదస్సును నిర్వహించనున్నది. దీనిలో భాగంగా సోమవారం ఈ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంకెన్నాళ్లిలా?

అమీన్‌పూర్ - చందానగర్ రోడ్డు విస్తరణకు గ్రహణం

పటాన్‌చెరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకమైన ఐటీ కారిడార్‌కు కూతవేటు దూరంలో ఉన్న అమీన్‌పూర్ ప్రధాన రహదారి ప్రత్యక్ష నరకానికి నిదర్శనంగా నిలుస్తోంది. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని సుమారు వంద కాలనీలకు ఈ రోడ్డే ప్రధాన రహదారి. మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో ఎక్కువ సంఖ్యలో ఐటీ ఉద్యోగులు, కార్మికులు నివాసం ఉంటున్నారు. నిత్యం గచ్చిబౌలి, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారు ఇదే రోడ్డుపై గమ్యస్థానాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అమీన్‌పూర్ నుంచి చందానగర్ వరకు ఉన్న ఐదు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

150 ఫీట్లతో ఫోర్ లేన్‌గా..

30 ఫీట్ల రోడ్డును 150 ఫీట్ల వెడల్పుతో నాలుగు లేన్లుగా విస్తరించేందుకు రెండేళ్ల క్రితం అమీన్‌పూర్ మున్సిపల్ కౌన్సిల్, అధికారులు పనులు ప్రారంభించారు. రోడ్డు విస్తరణ కోసం టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణా అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) సంస్థ ద్వారా రూ.15 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మరో రూ.7కోట్లు మంజూరుకు అంగీకరించారు. విస్తరణకు అడ్డుగా ఉన్న హెచ్‌టీ విద్యుత్ లైన్లను తరలించేందుకు హెచ్ఎండీఏ రూ.ఐదు కోట్లను మంజూరు చేసింది. రెండేళ్ల క్రితం టెండర్ ప్రకియ పూర్తి చేసుకోగా, రెండు ప్యాకేజీల్లో కాంట్రాక్టు సంస్థలు మొదటి విడత పనులు ప్రారంభించారు.

నిధులకు బ్రేక్

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంలో వేగంగా కొనసాగాయి. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తారని అంతా భావించారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత విడుదల కావాల్సిన నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టు సంస్థలు చేతులెత్తాశారు. టీయూఎఫ్ఐడీసీ మంజూరు చేసిన రూ.15కోట్ల నిధులు తక్షణం విడుదల చేస్తేనే పనులు ముందుకు సాగేలా ఉన్నాయి. నిధుల మంజూరు అంశం రాష్ట్ర పిన్సిపల్ సెక్రెటరీ చేతుల్లో ఉంది. ఈ సమస్య రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు సైతం అధికారులకు పలుమార్లు వినతిపత్రాలను ఇచ్చారు. త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చినా అడుగు ముందుకు పడలేదు.



అమీన్‌పూర్ - చందానగర్ రోడ్డు

సమగ్ర శిక్షా ఉద్యోగులు వెనక్కి!

- విధుల్లో చేరిన పలువురు ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా ఉద్యోగులు విధుల్లోకి చేరేందుకు సిద్ధమయ్యారు. కేజీబీవీల్లో పనిచేసే స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్‌టీలతో పాటు ఎంఆర్‌సీ, కాంప్లెక్స్ స్కూల్ పరిధిలో పనిచేసే ఉద్యోగులు, సీఆర్‌పీలు సైతం పలువురు సోమవారం సాయంత్రం రిపోర్ట్ చేసినట్టు విద్యాశాఖ అధికార వర్గాలు తెలిపాయి. సమగ్ర శిక్షా ఉద్యోగులు 31 రోజులుగా కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. అయితే క్రమబద్ధీకరణపై ఉద్యోగులతో ప్రభుత్వం పలు దఫాలుగా జరిపిన చర్చలు విఫలమైన విషయం విధితమే. క్రమబద్ధీకరణ సాధ్యం కాదని సర్కారు తేల్చిచెప్పగా, వెంటనే విధుల్లో చేరాలని లేకపోతే టర్మినేట్ చేస్తామని వారం కిందటే హెచ్చరించింది. సోమవారం ఉద్యోగులతో సర్కారు చర్చలు జరపగా, నాన్ ఫైనాన్షియల్ హామీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. దీంతో సోమవారం సాయంత్రం నాటికి కేజీబీవీల్లో పనిచేసే 22 మంది స్పెషల్ ఆఫీసర్లు, 130 మంది సీఆర్‌టీలు, 160 మంది నాన్‌టీచింగ్ సిబ్బంది విధుల్లో చేరినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

వెల్దుర్తి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థి కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మనేపల్లి ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పది పరీక్షల సమయం దగ్గర పడుతుందని విద్యార్థులు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలకు ప్రహరీ, సైన్స్ పరికరాలు, లైబ్రరీ పుస్తకాలు, మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు ఆమెను కోరారు. తప్పకుండా కృషి చేస్తానని, అలాగే పలువురు దాతలు కూడా పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే మనేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి ఉన్నారు. అలాగే సెహగల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మనేపల్లి గ్రామ శివారులో చెక్‌డ్యాం నిర్మాణానికి సుహాసినిరెడ్డితో కలిసి సంస్థ ప్రతినిధులు సోమవారం భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.

అత్యవసర సేవలకు అంబులెన్స్

నిజాంపేట/హవేళిఘణపూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సేవలకు అంబులెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం అంబులెన్స్ ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యం సేవలు సకాలంలో అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన జర్నలిస్ట్ నర్సాగౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుప్రభాతరావు, ముత్యంరెడ్డి, అమర్‌సేనారెడ్డి, సత్యనారాయణరెడ్డి, నసీరోద్దీన్, మహేందర్ మారుతి పాల్గొన్నారు. అలాగే హవేళిఘణపూర్ మండలం భూర్గుపల్లిలో మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు లెంక కిష్టయ్య, గాజిరెడ్డిపల్లి, పోచమ్మరాల్, సుల్తాన్‌పూర్ కార్యకర్తల కుటుంబీకులు వివిధ కారణాలతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు వారి కుటుంబీకులను సోమవారం పరామర్శించారు.

మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన

కొండాపూర్,జనవరి 6(ఆంధ్రజ్యోతి) : ఈ రోజుల్లో కూడా మూఢ విశ్వాసల వైపు మొగ్గు చూపడం దారుణమని జిల్లా జానవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీహెచ్ కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూఢ నమ్మకాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మట్టిలో మంట, గాజుసీసా పెంకులపై నడువడం, నిమ్మకాయ నుంచి రక్తం తీయడం తదితరాల వెనుక ఉన్న నిజాలను వివరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి వరప్రసాద్, సభ్యులు భూమయ్య, మల్లేషం, లలిత, రాములు, అర్చన, నాగేశ్వర్ పాల్గొన్నారు.



మట్టిలో మంట పుట్టించే విధానాన్ని వివరిస్తున్న జేవీవీ సభ్యులు

సీఎం రేవంత్‌రెడ్డినే తొలగిద్దాం

● ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్
● సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న కేఏ పాల్

సిద్దిపేట అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను సీఎం రేవంత్‌రెడ్డి తొలగిస్తే.. ఆయనను కూడా పదవి నుంచి తొలగిద్దామని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయం వద్ద గత 29 రోజులుగా కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు ఆయన సోమవారం సంఘీభావం తెలిపారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆయన సమ్మె శిబిరానికి చేరుకుని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి గౌరవ స్థానాన్ని పొందుతున్న వారిని రోడ్డుపై కూర్చోబెట్టడం మంచిది కాదని అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. హరీ‌ష్‌రావు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్య పరిష్కారానికి అండగా నిలబడాలని కోరుకుంటున్నారని, ఆయనను దేవుడు చల్లగా చూడాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు ట్రెస్మా రాష్ట్ర సమావేశం

● ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు



సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర నాయకులు

పటాన్‌చెరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రెస్మా) రాష్ట్ర జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పటాన్‌చెరులోని ఎస్వీఆర్ గార్డెన్స్‌లో జరిగే ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌కుమార్‌గౌడ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు హాజరవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 11వేల ప్రైవేటు పాఠశాలల్లో 35లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. వేలాది మంది ఉపాధ్యాయులు ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ క్రమంలో యాజమాన్యాలు అనేక సవాళ్లను, సమస్యలను ఎదుర్కుంటున్నాయన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు.

బ్యాక్టీరియా సంక్రమణలను ఎదుర్కోవచ్చు

● నైపర్ ప్రొఫెసర్ పీవీ భరతం



పీ.వీ.భరతంను సత్కరిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నూతన చికిత్స లక్ష్యాలతో బ్యాక్టీరియా సంక్రమణలను ఎదుర్కోవచ్చని మొహాలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) ప్రొఫెసర్ పీ.వీ.భరతం అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో యాంటీబాక్టీరియల్‌కు సంబంధించిన అంశంపై సోమవారం ఆయన అతిథ్య ఉపన్యాసనం చేశారు. తొలుత, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథిని స్వాగతించి, సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ అబిద్ అబ్దుల్లా వనీ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్ర కార్యనిర్వహణాధికారిగా విశ్వనాథశర్మ



బాధ్యతలు చేపడుతున్న విశ్వనాథశర్మ

వర్గల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం కార్యనిర్వహణాధికారిగా పి. విశ్వనాథ శర్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో రెగ్యులర్ విధులు నిర్వహిస్తున్న పి. విశ్వనాథ శర్మ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వుల మేరకు ఇక్కడ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నాచగిరి క్షేత్రంలో కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహించిన ఎస్.అన్నపూర్ణ హైదరాబాద్ చిక్కడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లారు. విశ్వనాథ శర్మకు ఆలయ అర్చకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎక్స్‌కవేటర్‌కు నిప్పు.. పూర్తిగా దగ్ధం



దగ్ధమవుతున్న జేసీబీ

జగదేవ్‌పూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌కు నిప్పు పెట్టారు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం మండలంలోని మునిగడప గ్రామానికి చెందిన మరాఠీ బాలస్వామి ఎక్స్‌కవేటర్‌ను నడుపుతూ ఉపాధి పొందుతున్నారు. రోజు మాదిరిగానే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో ఎక్స్‌కవేటర్‌ను ఉంచారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వెళ్లారు. సోమవారం గ్రామానికి వచ్చి చూసేసరికి జేసీబీ పూర్తిగా దగ్ధమై కనిపించింది. వెంటనే పోలీ‌స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ చంద్రమోహన్ గ్రామానికి చేరుకొని ఘటన వివరాలపై ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పసందుగా పచ్చికందుల పండుగ

● తెలంగాణ సంస్కృతి వంటకాల ప్రదర్శన ● సీజనల్ ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన

ప్రస్తుతం మాయాదారి జబ్బులు మంచాన పడేస్తున్నాయి. కొత్త రోగాలు ఒంటిని గుల్ల చేస్తున్నాయి. 40 ఏళ్లు దాటకముందే నరాల బలహీనతలు, ముప్పై రాకమందే మోకాళ్ల నొప్పులతో జనాలు అవస్థలు పడుతున్నారు. మాట్లాడుతుండగానే గుండె జబ్బులు మనుషులను దూరం చేస్తున్నాయి. చెప్పలేని రోగాలతో తిప్పలు పడటానికి మన దినచర్యతో పాటుగా మన ఆహారపు అలవాట్లే ప్రధాన కారణమని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో సీజనల్‌గా లభించే పండ్లు, కూరగాయలు, పంటలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వాటి వల్ల లభించే లాభాలను తెలుసుకోవాల్సి ఆవశ్యకత ఉంది. అలాంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు సిద్దిపేట డిగ్రీ కళాశాల తెలుగు విభాగం విద్యార్థులు.



వివిధ రకాల వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో పచ్చికందుల పండుగ అనే కార్యక్రమం నిర్వహించారు. నవకల్పన అంశానికి సంబంధించి, తెలంగాణ ఆహార సంస్కృతిని తెలిపే ఉద్దేశంతో ఏకో ఫ్రెండ్లీ ప్రోగ్రాంలో భాగంగా కంది చెట్టు వద్ద పూజలు చేసి దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సునీత, తెలుగుశాఖ అధ్యక్షుడు మట్టా సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సీజనల్‌గా దొరికే ఆహారం సక్రమంగా వాడితే అందరు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. పూర్వీకులు అందించిన ఆహారపు ఆలవాట్లపై ప్రస్తుతం అవగాహన, వాటి ఉపయోగాల పట్ల చైతన్యం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తెలంగాణ ఆహార సంస్కృతి ఎంత సరళమైనదో, అంత స్వచ్ఛమైనదన్నారు. జంక్ ఫుడ్, రెడీమెడ్ ఫుడ్ స్థానంలో స్థానికమైన, సహజమైన ఆరోగ్యకరమైన ఆహారంపై అభిమానం కల్గించటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రాణవాయువు నుంచి పదార్థం వరకు ప్రకృతితోనే మనిషి జీవితం ముడిపడి ఉందని, ప్రకృతిని అర్థం చేసుకుని వనరులను కాపాడుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న వంటకాల ప్రదర్శన

సిద్దిపేట డిగ్రీ కళాశాలలోని ఎంఏ తెలుగు విద్యార్థులు తయారు చేసిన తెలంగాణ సంస్కృతి వంటకాలు ఆకట్టుకున్నాయి. చలికాలంలో స్థానికంగా పండే పచ్చి కందులతో చేసిన తీరొక్క వంటలను ప్రదర్శించారు. ఆ పదార్థాలు తయారు చేసే విధానం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. 80 రకాల వంటకాలను



ప్రదర్శించారు. సంప్రదాయాల వంటలైన గుడాలు, కుడుములు, సర్వపిండి, రొట్టె, బగారన్నం, ఉడుకబెట్టిన కందికాయ, అట్టు, బక్షాలు, పాయసం, గారెలు, కూరలు, పప్పులు, పులుసులు, ఆధునిక వంటకాలైన ఇడ్లీ, వడ, బజ్జీలు, బిర్యానీ, కందుల సేమ్యా, కందుల నూడుల్స్, కందుల మిక్చర్, కందుల లడ్డూ తదితర రకాలను ప్రదర్శించారు.

కందులలో చాలా పోషకాలు..



నేను ఉడకబెట్టిన కందులు, గుడాలు చేశాను. ప్రకృతి సహజసిద్ధంగా అందించే ఆహారం వల్ల శరీరానికి చాలా ప్రయోజనం చేకూరుతుంది. మా ఎంఏ తెలుగు విభాగాధిపతి సంపత్ కుమార్‌సార్ ఆలోచనతో ఈ కార్యక్రమంలో పాల్గొని చాలా విషయాలు నేర్చుకున్నాం. కందులు అనేవి చాలా ఏళ్లుగా పండిస్తున్నాం. ఇందులో చాలా పోషకాలు ఉంటాయి. వీటిని ఆహారంగా తీసుకుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

- అన్నసాగర్ మల్లీశ్వరీ, ఎంఏ, తెలుగు అందోల్, సంగారెడ్డి జిల్లా

సీజనల్ ఆహారంతో ఆరోగ్యం..



కందులతో ఇన్ని రకాల వంటలు చేయవచ్చా అని అనిపించింది. ఈ కార్యక్రమం ద్వారా చాలా నేర్చుకున్నాం. సీజనల్‌గా స్థానికంగా పండే ఆహారం ద్వారా ఎలాంటి ప్రయోజనాలు వస్తాయో తెలుసుకున్నాం. నేను కందుల గారెలు, వరి పిండి రొట్టెలు, కంది పకోడి, ఆవిరితో ఉడికించిన కందిని ప్రదర్శనలో పెట్టాను. కందుల తింటే దగ్గు, చర్మ వ్యాధులు దూరమవతాయి.

-రాజశేఖర్ , ఎంఏ తెలుగు విద్యార్థి

జహీరాబాద్ అభివృద్ధికి కృషి

● ఎంపీ సురే‌ష్‌కుమార్ షెట్కార్



మాట్లాడుతున్న ఎంపీ సురేస్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ అభివృద్ధికి కృషి చేస్తామని జహీరాబాద్ ఎంపీ సురే‌ష్‌కుమార్ షెట్కార్ , సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీ గెస్ట్‌హౌజ్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులతో అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలో రూ.90 కోట్లతో చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి, బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలు, తదితర అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా పాడైన రోడ్లకు త్వరిత గతిన మరమ్మతులు చేయాలన్నారు. పలుచోట్ల భూసేకరణ జాప్యంపై దృష్టి పెట్టి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆర్డీవో రాంరెడ్డికి సూచించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తమదృష్టికి తీసుకురావాలన్నారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం పనికిరాదని అధికారులను హెచ్చరించారు. అందరం కలిసి జహీరాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, టీఎ్‌సఐడీసీ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ వివిధ శాఖలకు చెందిన అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన జక్కిడి శివ చరణ్‌రెడ్డి జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీ అభినందించారు.



బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న యాదవ కుటుంబాలు

వైభవంగా మల్లన్న కల్యాణం

● హాజరైన పీఠాధిపతి మాధవానందస్వామి, ఎమ్మెల్యే

నర్సాపూర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని మర్కతమల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు యాదవసంఘం ఆధ్వర్యంలో వైభవంగా సాగుతున్నాయి. సోమవారం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం బోనాలతో స్వామి వారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. కల్యాణానికి రాంపూర్ పీఠాధిపతి మాధవానందస్వామి హాజరై పూజలు నిర్వహించి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రాజమణిమురళీధర్‌యాదవ్, లేబర్ వెల్ఫేర్‌బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, కౌన్సిలర్లు రాజేందర్,బుచ్చే‌స్‌యాదవ్, యాదగిరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్‌యాదవ్, రఘువీరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ వ్యాపారి శ్రీధర్‌గుప్తా భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు

● బైక్‌ను ఢీకొని రోడ్డుపక్కకు దూసుకెళ్లిన వైనం
● వ్యక్తి పరిస్థితి విషమం.. విద్యార్థులకు స్వల్ప గాయాలు





ఘటనా స్థలంలో బస్సు, గాయపడిన ప్రకాశ్ (ఇన్‌సెట్లో)

పుల్కల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో ఒకరు తీవ్రంగా గాయపడగా, పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని ఎంఎన్ఆర్ పాఠశాల బస్సు సోమవారం సాయంత్రం పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ పెద్దగొల్ల అంజనేయులు విద్యార్థులను ఎక్కించుకుని గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ముదిమాణిక్యం చౌరస్తా వద్దకు రాగానే మిన్‌పూర్ గిరిజన తండాకు చెందిన బానోత్ ప్రకాశ్ (36) బైక్‌పై పుల్కల్ నుంచి తండాకు వెళ్తున్నారు. బస్సు అదుపు తప్పి బైక్‌ను ఢీకొడుతూ రోడ్డు పక్కకు దూసుకువెళ్లడంతో ప్రకాశ్ తలకు బలమైన గాయాలుకావడంతోపాటు చేయి విరిగింది. పలువురు విద్యార్థులకు సల్ప గాయాలయ్యాయి. ప్రకాశ్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలు మినహా విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరుగకపోవడం ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

● రెండు దాబాలకు నోటీసులు జారీ



కందిలోని కింగ్స్ దాబాలో కలర్‌తో చేసిన వంటకాలను పారబోయిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ

సంగారెడ్డి అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని పలు దాబాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృత శ్రీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీషికా, రాజేశ్వర్‌ల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ మాట్లాడుతూ కందిలోని కింగ్స్, కింగ్స్-2 దాబాలను విస్తృతంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. శాంపిళ్లు సేకరించి, పరిశుభ్రత మెరుగుపర్చుకోవాలని నోటీసులు ఇచ్చామన్నారు. కలర్ వేసి వండిన పలు వంటకాలను పారబోశామని తెలిపారు. దాబాల్లో పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతుల ఆందోళన

శివ్వంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సెహగల్ ఫౌండేషన్ తీరుకు నిరసనగా రైతులు ఆందోళన చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలో పంట పొలాల్లో బావులను పూడ్చివేస్తామని సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు చెప్పడంతో రైతులు పొలాల్లో నాటు వేయలేదు. అంతేకాకుండా లోడ్‌తో వచ్చే వాహనాల కసం మట్టి రోడ్డు కూడా వేశారు. తీరా ఇప్పుడు బావుల పూడ్చివతే టార్గెట్ అయిపోయిందని ఫౌండేషన్ ప్రతినిధులు చెప్పడంతో రైతులు కంగుతిన్నారు. దీంతో సోమవారం సదరు ఫౌండేషన్ ఇటాచి వాహనం వద్ద ఆందోళన చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ సంస్థ ప్రతినిధుల మాటలు నమ్మి మోసపోయమన్నారు. కార్యక్రమంలో రైతులు కల్లూరి రాములు, పద్మయ్య, నర్సింహులు, సత్తయ్య, వేమారెడ్డి ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

● డీటీవో వెంకటస్వామి



ఆర్టీసీ డ్రైవర్లను సన్మానిస్తున్న డీటీవో వెంకటస్వామి, ఆర్ఎం ప్రభులత

మెదక్ అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి(డీటీవో) వెంకటస్వామి ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక బస్ డిపోలోని గ్యారేజ్‌లో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... ప్రతి రోజు రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ.. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. ఆర్ఎం ప్రభులత మాట్లాడుతూ..డ్రైవర్లు సమయ పాలన పాటించాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లు ఉపయోగించొద్దన్నారు. చలికాలం మంచు కారణంగా ఓవర్‌టేక్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళ ఉద్యోగులు ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. డిసెంబర్ నెలలో అత్యధిక ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు నగదు అవార్డులను అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎం సురేఖ, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన గురుకుల విద్యార్థులు

హవేళిఘణపూర్, జనవరి6;(ఆంధ్రజ్యోతి); మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రెంజుకిషొటోకాన్ కరాటే వ్యవస్థాపక అధ్యక్షుడు నగేష్ మాస్టర● ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో 87 మంది గురుకుల విద్యార్థులకు 43 మందికి గోల్డ్, 20 మందికి సిల్వర్, 24 మందికి కాంస్య మెడల్స్ సాధించినట్లు గురుకుల ప్రిన్సిపాల్ సృజన సోమవారం తెలిపారు. కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, ప్రిన్సిపాల్ అభినందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



కృష్ణ మృతదేహం

మాసాయిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన విరాల ప్రకారం మాసాయిపేట మండలం నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన జింక కృష్ణ(45) తాగుడుకు బానిసై తరచుగా కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామంలోని తన గుడిసెలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు.

ఇంటి తాళం పగులకొట్టి చోరీ

● 5తులాల బంగారం, రూ.5 లక్షలు తస్కరణ

దుబ్బాక, జనవరి6(ఆంధ్రజ్యోతి): తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటనం దుబ్బాక మండలం రామక్కపేటలో చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 4న గ్రామానికి చెందిన సింగెపు బాలయ్య ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి వచ్చి చూసేసరికి ఇంటి తాళం, లోపల ఉన్న బీరువా తాళం పగుల కొట్టి ఉన్నది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 5తులాల బంగారు నగలు, రూ.5లక్షల నగదును కనిపించలేదు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దుబ్బాక ఎస్ఐ తెలిపారు.

నిషేధిత మాంజా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న చైనా మాంజా

గజ్వేల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని పతంగుల దుకాణాలపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలో చైనా మాంజా విక్రయిస్తున్నారని సమాచారంతో పలు దుకాణాల్లో తనిఖీలు చేసి నిషేధిత చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. వాటిని విక్రయిస్తున్న గౌసొద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

కొమురవెల్లిలో బొలెరో టైర్ల అపహరణ

చేర్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సమీపంలో రోడ్డుపక్కన పార్కింగ్ చేసిన బొలెరో వాహనం టైర్లను ఆగంతకులు ఇటీవల అపహరించుకుపోయారు. మల్లన్న ఆలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సమీపంలోని ఓ ప్రైవేటు ఇంట్లో అద్దెకు నివసిస్తుండగా, ఇంటి ఆవరణలో బొలెరో వాహనాన్ని పార్కింగ్ చేసుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు రెండురోజుల క్రితం గ్రానైట్ రాళ్లను బ్యానెట్ కిందపెట్టి రెండు టైర్లను దొంగిలించుకుపోయారు. ఈ విషయమై బాధితుడు కొమురవెల్లి పోలీ‌స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా పోలీసులు నిందితుడిని పట్టుకున్నట్లు తెలిసింది.



న్యూస్ బాక్స్

కళాశాలను సందర్శించిన డీఐఈవో మాధవి

వెల్దుర్తి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీరాయ రావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వం జూనియర్ కళాశాలను సోమవారం డీఐ ఈవో మాధవి ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు/కొడిపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నేడు పటాన్‌చెరు నియోజకవర్గంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు పేర్కొన్నారు. ఐనోల్ సబ్‌స్టేషన్ పరిధిలోని సత్యసాయి ఫీడర్ పరిధి సిటిజన్ కాలనీ, సాయికాలనీ, నవ్యనగర్, పీఎస్ఆర్ టౌన్‌షిప్, ఆనుమోల్, ద క్రాస్ తదితర కాలనీల్లో, అలాగే ఇంద్రేశం ఫీడర్ పరిధిలోని ఇంద్రేశం, కురుమబస్తీ, ఎస్సీ కాలనీ, పార్వతీపురం, ఆరతినగర్, నవ్యతులసి కాలనీల్లో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రామకృష్ణ తెలిపారు. ఎంబిజీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉస్మాన్‌నగర్, తెల్లాపూర్, ముప్పాకాలనీ, ఏలియన్స్ టవర్స్ ఫీడర్ల పరిధిలో పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ జీ.శివశంకర్ పేర్కొన్నారు. కొడిపల్లి మండలంలోని వెంట్రావ్‌పేట్, రాజిపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు ఉదయం 11 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాయికుమార్ తెలిపారు. నర్సాపూర్ నుంచి నూతనంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తుండడంతో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఘనంగా మహాపడి పూజ

రామచంద్రాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : కొల్లూరు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ మయూరీరాజుగౌడ్ నేతృత్వంలో సోమవారం అయ్యప్పస్వామి మహాపడి పూజ నిర్వహించారు. ఈ మహాపడిపూజలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు, కౌన్సిలర్ సుధాశ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు: ఏడీఏ

సంగారెడ్డి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఎరువులు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవని ఏడీఏ వెంకటలక్ష్మి హెచ్చరించారు. సంగారెడ్డిలోని ఓ ఫర్టిలైజర్ షాపులో సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. అధిక లాభం వస్తుందనే దురాశతో నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్లు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

సంగారెడ్డి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఫౌండేషన్ డే సందర్భంగా సంగారెడ్డిలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా శాఖ క్లాస్-1 ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి పరిధిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు క్రీడా సామగ్రిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ డివిజన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పూల్లూరు ప్రకాశ్ మాట్లాడారు.

'ఆత్మ శుద్ధిలేని దైవ చింతన నిరర్ధకం'

కంగ్టి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆత్మ శుద్ధి లేకుండా చేసే దైవ చింతన నిరర్ధకమని మహారాష్ట్రలోని దెగ్లూర్‌గుండా మహరాజ్ పీఠాధిపతి చంద్రశేఖర్ మహరాజ్ పేర్కొన్నారు. కీర్తన సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కంగ్టిలో వారి కార్‌సాంప్రదాయం మేరకు భక్తులకు అనుగ్రహ బాషణం చేశారు.

లింగాపూర్‌లో కృష్ణదేశిక స్వాముల వారి పుణ్యతిథి

నారాయణఖేడ్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మండలం ఆకుల లింగాపూర్‌లో సోమవారం కృష్ణదేశిక స్వాములవారి 95వ పుణ్యతిథి మహోత్సవాన్ని విఠల్‌దాస్ మహరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి అభిషేకం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజన, నారాయణదాస్ గారిచే హరికథా కాలక్షేపం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిక

తూప్రాన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి రెండోవార్డు బుడగ జంగాల కాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు చంద్రం, నర్సింలు, సత్యం, పెంటయ్య, నరేందర్, రమేష్, యాదగిరి, వసంత్, రాజు, సంజీవ్, ఆంజనేయులు, ఆజయ్, శంకర్, రవి, సత్యనారాయణ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



మెదక్ అర్బన్: దరఖాస్తులు స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

'ప్రజావాణి'ని నిర్లక్ష్యం చేయొద్దు

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి వివిధ శాఖల జిల్లా అధికారులకు సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల అర్జీదారులు వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురికి అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించినప్పుడే వారిపై గౌరవం పెరుగుతుందన్నారు. ప్రజావాణికి మొత్తం 85 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులపై అలసత్వం తగదు

మెదక్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులపై అలసత్వం తగదని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు తరలివచ్చారు. ప్రజావాణికి మొత్తం 61 దరఖాస్తులు రాగా.. ఇందులో అధికంగా భూసమస్యలు 20, ఇందిరమ్మ ఇళ్లు 11 రాగా.. పెన్షన్ 3, ఇతర సమస్యలపై 27 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

పారదర్శకంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



నమూనా ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్, కోహీర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అత్యంత పాదర్శకంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో హౌసింగ్ అధికారులతో కలిసి మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికలో దళారులు, రాజకీయ జోక్యం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చలపతిరావు, ఎంపీడీవో యాదగిరి, డీఈ రవీందర్, ఏఈ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే పోచారం గ్రామంలో నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన కోహీర్‌లోని పలు కాలనీల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతిరావు సోమవారం తన సిబ్బందితో కలిసి పరిశీలించారు.

లింక్‌రోడ్లతో ఔటర్ రింగ్‌రోడ్డుకు చర్యలు

● ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



మంగల్‌పేటలో లింక్‌రోడ్లకు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్/కల్హేర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా లింక్‌రోడ్లతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్-కరస్‌గుత్తి మార్గంలోని మనూరు క్రాస్ రోడ్డు, పట్టణం పక్క నుంచి నిజాంపేట- ఖేడ్-బీదర్ జాతీయ రహదారి వరకు నిర్మిస్తున్న రింగ్ రోడ్డు పనులకు మంగల్‌పేట శివారులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భూమి పూజ చేసి మాట్లాడారు. వెంకటాపూర్ సమీపం నుంచి ఔటర్ రింగ్ రోడ్డును సైతం నిర్మించాలనే వినతులు వస్తున్నందున అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. 40 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్న రింగ్‌రోడ్డుకు రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన స్వగ్రహంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులన అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, లింగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాధాకిషన్, మాణిక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖేడ్ ఏరియా వైద్యశాల ఆవరణలో సలహా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక బృంద మహిళలు ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అశోక చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన సిర్గాపూర్‌కు మంజూరైన 108 అంబులెన్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదవరెడ్డి, మహేశ్వర్‌గుప్తా, మాజీ ఎంపీటీసీ పీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వచ్చేవారితో మర్యాదగా వ్యవహరించాలి: ఎమ్మెల్యే



నార్సింగి ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యమందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నార్సింగి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికిని సోమవారం ఆయన సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ హెల్త్ సెంటర్‌లో 108 అంబులెన్స్ సర్వీస్ ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరీం, ఎంపీడీవో ఆనంద్, వైద్యాధికారులు రవికుమార్, రేఖ, మాజీ ఎంపీపీ సబిత, మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● రాష్ట్ర శాసనమండలి చీఫ్ సెక్రటరీ వీరారెడ్డి

చిన్నశంకరంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలంగాణ శాసనమండలి చీఫ్ సెక్రటరీ వీరారెడ్డి, పరీక్షల ప్రిపేర్ మోటివేషన్ పరిశీలకులు బీ.వీరారెడ్డి అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట మండలంలోని సూరారం హైస్కూల్లో హెచ్ఎం సాయిరెడ్డి ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దర్పల్లి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతరలు సంస్కృతికి ప్రతీకలు

● కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్



పోచారం మల్లన్న జాతరలో నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామదేవతలను ఆరాధిస్తూ ప్రజలు జరుపుకునే జాతరలు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకలని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోచారంలో ప్రారంభమైన మల్లన్న జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. అట్టహాసంగా జరుపుకునే పోచారం జాతరకు దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు భిక్షపతి, కిష్టయ్య, నాగభూషణం, మల్లేష్, సత్తయ్య, దేవరాజ్, రవి, భద్రయ్య, నవీన్, మధు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి'

మెదక్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నిలకు వెళ్లాలన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించి, జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుభాష్‌గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌పటేల్, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందజేస్తున్న మాణిక్‌రావు

జహీరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పథకాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖాసీంపూర్‌కు చెందిన నర్సింహారెడ్డికి రూ.60 వేలు, హుగ్గెల్లికి చెందిన వీరన్నకు రూ.22 వేల చెక్కులను అందజేసి మాట్లాడారు.

నిధులు రికవరీ చేయండి

కల్హేర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మార్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్)లో దుర్వినియోగమైన రూ.13.96 లక్షల నిధులను రికవరీ చేయాలని సంగారెడ్డి జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ సోమవారం సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీకి ఉత్తర్వులు జారీచేశారు. మార్డి సొసైటీకి వచ్చిన ఆదాయంలో రైతులైన సభ్యులకు లెక్కలు చెప్పకుండా చైర్మన్ వెంకటేశం, కార్యదర్శి అరవింద్‌గౌడ్ రూ.19 లక్షలను దుర్వినియోగం చేశారంటూ వైస్ చైర్మన్ ఎన్నం సంగారెడ్డి, ఐదుగురు డైరెక్టర్లు కలెక్టర్, డీసీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై పలు దఫాలుగా విచారణ జరిపిన సహకారశాఖ అధికారులు ఇదివరకే కార్యదర్శిని సస్పెండ్ చేశారు. మరోసారి విచారణ జరిపిన అనంతరం మార్డి సొసైటీలో రూ.13.96 లక్షల దుర్వినియోగమైనట్లు నిర్ధారించిన అధికారులు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి నిధులను రికవరీ చేసి చైర్మన్‌ను అనర్హుడిగా ప్రకటించాలని పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో మేలు

రేగోడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక దిగుబడి వస్తుందని రాష్ట్ర ఆయిల్‌పామ్ టెక్నికల్ సలహాదారు రంగనాయకులు అన్నారు. సోమవారం రేగోడు రైతువేదికలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానివి అడ్డగోలు హామీలు

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ● ఆరు గ్యారంటీలపై నిరసనలు



నర్సాపూర్‌లో ఆరు గ్యారంటీల బ్యానర్‌తో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



చిన్నశంకరంపేటలో మెదక్-చేగుంట రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నర్సాపూర్/చిన్నశంకరంపేట/వట్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అడ్డగోలుగా హామీలిచ్చి వాటిని అమలు చేయడం చేతకాక ప్రజలను నిలువునా మోసం చేసిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎమ్మెల్యే స్వగృహం నుంచి నాయకులంతా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల బ్యానర్‌ను పాడెపై పెట్టి చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి.. రాస్తారోకో నిర్వహించారు. అనంతరం బ్యానర్‌ను రోడ్డు పక్కనే తీసిన గుంతలో పూడ్చేశారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాదవుతున్నా.. అమలుచేయడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బబియానాయక్, మాజీ ఎంపీపీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలంలో మెదక్-చేగుంట రహదారిపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు ఆధ్వర్యంలో గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ప్రభాకర్ పాల్గొన్నారు. వట్‌పల్లిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

అర్ధాకలి చదువులు

5వ పేజీ తరువాయి

అధికారులు, పూర్వ విద్యార్థులు, యువజన సంఘాలు ముందుకొస్తే విద్యార్థుల ఆకలి తీర్చడంతోపాటు వారి చదువులకు చేయూతనిచ్చిన వారవుతారు. తక్కువ ఖర్చుతో పిల్లల ఆకలిని తీర్చే మార్గం ఉంది. శనగలు, పెసర్లు, బొబ్బెర్లు, పల్లీలు, అటుకుల చుడువా, బిస్కెట్లు, ఉప్మా, జామకాయలు,అరటిపండ్లు తక్కువ ఖర్చులోనే అందుబాటులో ఉన్నాయి. ఇందుకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.10 చొప్పున ఖర్చు అవుతోంది.

స్నాక్స్ అందిస్తే బాగుంటుంది



నేను నాలుగు కిలో మీటర్ల దూరం నుంచి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలకు రావాలి. ఉదయమే ఇంటి దగ్గర టిఫిన్ చేసి రావడం ఇబ్బందిగా ఉంది. పదో తరగతిలో ఉత్తమ గ్రేడ్ కోసం పాఠశాలలో చేపట్టిన ప్రత్యేక క్లాస్‌కు హాజరువుతున్నాను. టీచర్లు అన్ని సబ్జెక్టులను ప్రణాళిక ప్రకారం బోధిస్తున్నారు. సాయంత్రం వేళ్లలో పాఠశాలలో స్నాక్స్ అందిస్తే బాగుంటుంది.

- శ్రావణి, పదో తరగతి విద్యార్థిని

నీళ్లతోనే సరిపెట్టుకుంటున్నాం



ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. చాలా మంది విద్యార్థులు ఆకలికి తట్టుకోలేక తాగునీళ్లతోనే కడుపులు నింపుకొంటున్నారు. రెండు నెలల పాటు కొనసాగే ప్రత్యేక తరగతుల సందర్భంగా ప్రభుత్వమే అల్పాహారం ఏర్పాటు చేస్తే అనేక మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది.

- భార్గవ్, పదో తరగతి

వచ్చే నెలాఖరు వరకు ప్రత్యేక తరగతులు



విద్యార్థులు పదిలో ఉత్తమ గ్రేడ్లు రావడానికి ముందస్తుగా ప్రణాళిక రూపొందించాం. నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తిచేశాం. 2 నుంచి వచ్చేనెలాఖరు వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు దాతలు ముందుకు రావాలి.

- రాధాకిషన్ డీఈవో, మెదక్

అక్రమంగా సమాధుల తొలగింపు

● సంగారెడ్డి ఎస్పీకి స్థానికుల ఫిర్యాదు



చింతల్‌చెర్వులో సమాధులను తొలగించిన దృశ్యం

హత్నూర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని చింతల్‌చెర్వు గ్రామంలో సమాధులను అక్రమంగా తొలగించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ శివారులోని సర్వే నెంబరు 419లో నాలుగు గంటల భూమిని ఎస్సీ కులానికి చెందిన కొన్ని కుటుంబాలకు అవసరమైన సమాధుల నిమిత్తం గతంలో గ్రామానికి చెందిన ఓ దాత కేటాయించాడు. అప్పటి నుంచి ఆ కుటుంబాల్లో ఎవరు చనిపోయినా.. అక్కడే సమాధి చేస్తున్నారు. అదే సర్వే నెంబరులోని కొంతభూమిని హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేసి, సమాధులు పెట్టిన స్థలం తనదంటూ తొలగించాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆ గ్రామానికి చెందిన బంగారొళ్ల రాజు తెలిపారు.

'భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి'

సంగారెడ్డి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం వెలిమెలి గ్రామంలో భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, వారికి వత్తాసు పలుకుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వెలిమెల గ్రామస్థులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు అన్యాయం చేస్తున్న అధికారులపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు.

బొల్లారంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలో అనుమతి లేకుండా నిర్మించిన పలు కట్టడాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. సోమవారం స్థానిక 81, 84 సర్వే నెంబరులో వింధ్యా ఆర్గానిక్స్ పరిశ్రమ వద్ద అనుమతి లేకుండా నిర్మించిన పలు షెడ్లు, కట్టడాలను కూల్చివేసినట్లు టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్ తెలిపారు. మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ స్థలాలు, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్



సంగారెడ్డిలో వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యువకులు

సంగారెడ్డి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నేటితరం యువతకు క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శివనాగప్ప ఫౌండేషన్ అధ్యక్షుడు నందీశ్వర్, హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షుడు రాముల్ అన్నారు. సంగారెడ్డిలో సీజన్ 4 వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించి కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్ మండలాల్లో 12న పట్లోళ్ల శివనాగప్ప మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు ట్రోఫీతో అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పవన్, రాహుల్‌పాటిల్, సునీల్, సంగమేశ్వర్, నబి తదితరులు పాల్గొన్నారు.

'స్థలం కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

నారాయణఖేడ్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూమిని నాలా కింద మార్పిడి చేయకుండానే తన కొంత స్థలాన్ని కబ్జాచేసిన ఇంటి నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రమైన నిజాంపేటకు చెందిన కాలేరు చరణ్ అధికారులను కోరారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్‌కు చెందిన యోగేష్ రాథోడ్ వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి నాలాగా మార్చుకోకుండానే పక్కనున్న తనకు చెందిన కొంత స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టాడని తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తి కాకుండానే పంచాయతీ కార్యదర్శి ఇంటి నెంబరుతో పాటు అసెస్‌మెంట్ నెంబరు కూడా కేటాయించాడని తెలిపాడు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

అధిక నీటిని లాగుతున్నవారిపై చర్యలు తీసుకోవాలి

శివ్వంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో నల్లాలకు మోటార్లు పెడుతూ అధిక నీటిని లాగుతున్నారని వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కార్యదర్శిపై గ్రామస్థులు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శివ్వంపేట గ్రామపంచాయతీలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. 4, 10వ వార్డుల్లో 20 రోజులుగా నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా కార్యదర్శి చర్యలు చేపట్టకపోవడంతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.